www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 10 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-207 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇక మెట్రో

## రాయదుర్గం వద్ద మెట్రో లైన్‌కు శంకుస్థాపన





- మూడేళ్లలో పనులు పూర్తయ్యేలా చర్యలు
- ఔటర్ చుట్టూ మెట్రో విస్తరణకు చర్యలు
- కేంద్ర సహకారం లేకున్నా పూర్తి చేసితీరుతాం
- పవర్ ఐలాండ్‌గా హైదరాబాద్ నగరం
- హైదరాబాద్ ఖ్యాతిని మరింత పెంచుతామన్న కెసిఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** హైదరాబాద్ నగర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపిం చారు. భవిష్యత్‌లో హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ మెట్రోను విస్తరిస్తామని కేసీఆర్ ప్రకటించారు. కేంద్ర సహకారం ఉన్నా లేకున్నా.. మెట్రోను విస్తరిస్తామని సీఎం స్పష్టం చేశారు. మైండ్ స్పేస్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మెట్రో పనులకు సీఎం కేసీఆర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకూ 31 కి.మీ. మేర మెట్రో లైన్‌ను నిర్మించనున్నారు. రూ.6,250 కోట్ల అంచనాతో ఈ మెట్రో నిర్మాణం జరగనుంది. వచ్చే మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్మాణం పూర్తయితే ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల్లోనే వెళ్లవచ్చు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పోలీసు అకాడమిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. మైండ్ స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్ల దూరం.. వందకు వంద శాతం రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ, జీఎంఆర్ నిధులతో ప్రారంభం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అందరికీ హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నానని కేసీఆర్ చెప్పారు. 1లాగే హైదరాబాద్‌ను విద్యుత్ కట్స్ లేని నగరంగా తీర్చిదిద్దామని అన్నారు. గ్రిడ్‌లతో హైదరాబాద్‌ను అనుసంధానం చేశామని అన్నారు. అందుకే ఇక కరెంట్ పొమ్మన్నా పోదని స్పష్టం చేశారు. హైదరాబాద్ సుప్రసిద్ధమైన నగరం. ఒక సందర్భంలో దేశ రాజధాని ఢిల్లీ కంటే కూడా వైశాల్యంలో,

3వ

# తెలంగాణకు టిఆర్ఎస్ పీడ విరగడ



- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కెసిఆర్
- రైతులకు ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్
- ప్రధాని ఆవాస్ ఇళ్ల లెక్కలు చెప్పాలి
- పాదయాత్రలో బండి సంజయ్ డిమాండ్

**జగిత్యాల,డిసెంబర్ 9 (సమ సమాజం):** టీఆర్ఎస్ రద్దుతో తెలంగాణకు కేసీఆర్ పీడ పోయిందని.. పార్టీ పేరులో తెలంగాణను తీసేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో బండి సంజయ్ మాట్లాడారు. ఇక్కడ చెల్లని రూపాయి ఢిల్లీలో చెల్లుతుందా అని టీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేశారు. దేశానికి వ్యతిరేకంగా ఉండే వారంతా దొంగల

3వ

# విభజన సమస్యలను సాధించడంలో జగన్ వైఫల్యం

- అందుకే మళ్లీ ఉమ్మడి ఎపి అంటూ రాగాలు
- సజ్జల వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల, డిసెంబర్ 9 (సమ సమాజం):** ప్రత్యేకహోదాను, విభజన సమస్యలను సాధించలేని ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎప్పటికీ శాశ్వతం కాదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించుకోవడంలో వారు విఫలమయ్యారని విమర్శించారు. ప్రత్యేక హోదా ఎందుకు సాధించుకోలేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మాజీ ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న జీవన్ రడ్డి.. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు యావత్ తెలంగాణ ప్రజలు రుణపడి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభజన హామీలపై ప్రధాని మోడీని ఎందుకు అడగలేకపోయారు అంటూ జీవన్

3వ






# బిఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక పూజలు




పూజా కార్యక్రమంలో కెసిఆర్ తదితరుల హాజరు

**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పూజలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎంతోపాటు జేడీఎస్ చీఫ్ కుమారస్వామి, సినీ నటుడు ప్రకాశ్ రాజ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,

3వ

# మోడీని ఢిల్లీ ప్రజలే ఛీత్కరించారు

- హిమాచల్‌లో బిజెపిని తిరస్కరించారు
- ఎన్నికల ఫలితాలపై ఫోకస్ పెట్టని మీడియా
- మోడీని ఆకాశానికి ఎత్తుకోవడంతోనే సరి
- సోనియా బర్త్‌డే వేడుకల్లో పిసిసి చీఫ్ రేవంత్



**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** ప్రధాని నరేంద్రమోడీని ఢిల్లీ ప్రజలే వద్దనుకుంటున్నారని

3వ

# 32 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తలకోన అటవీ ప్రాంతంలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్



**తిరుపతి, డిసెంబర్ 9 (సమ సమాజం):** శేషాచలం అటవీ ప్రాంతంలోని తలకోన అటవీ ప్రాంతంలో 32 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్

3వ

## సంపాదకీయం

# కాంగ్రెస్‌కు ఊపిరి పోసిన హిమాచల్ !

రెండు రాష్ట్రాల ఎన్నికలు, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మూడు పార్టీలకు కొంత ఊరట నిచ్చాయనే చెప్పాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి హిమాచల్ విజయం కొత్త శక్తిని ఇచ్చిందని గ్రహించాలి. దారీతెన్నూ లేకుండా కొట్టుకుపోతున్న క్రమంలో హిమాచల్ ఫలితం ఆ పార్టీకి జీవం పోసిందనాలి. కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్ ఒక్క రాష్ట్రంలో అయినా పాగా వేయడం ఇప్పుడు అవసరం. గుజరాత్‌లో ఎలాగూ గెలవలేరు. అక్కడ సీట్లు పెరిగాయా తగ్గాయా అన్నది కూడా ఇప్పుడా పార్టీకి పెద్ద లెక్క కాదు. బిజెపి పాలనలో ఉన్న హిమాచల్‌ను తమ ఖతాలో వేసుకోవడమే కాంగ్రెస్‌కు పెద్ద విజయమని చెప్పాలి. అలాగే అక్కడ ఎన్నికల ప్రచారంలో చురకుగా పాల్గొన్న ప్రియాంకగాంధీకి కూడా ఈ ఫలితాలు ఊరటనిచ్చేవిగా ఉన్నాయి. జోడోయాత్ర చేస్తున్న రాహుల్‌కు కూడా ఈ ఫలితం కొంత చైతన్యం కలిగించేవనే చెప్పాలి. అలాగే ఈ మధ్య కాలంలో పంజాబ్‌లో పాగా వేశాక ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కూడా ఆప్ మంచి ఫలితాలు రాబట్టి దేశ రాజధానిలో పాగా వేసింది. ఇది ఆ పార్టీకి బాగా కలసివచ్చింది. అంతేకాదు.. జాతీయ పార్టీగా అర్హత కూడా సాధించింది. ఇది కూడా ఆప్‌కు కలసివచ్చిన అంశంగా చూడాలి. ఇకపోతే ఓ రకంగా ఈ ఎన్నికలు బిజెపినే కుంగదీసాయని చెప్పాలి. రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా ఒక రాష్ట్రాన్ని కోల్పోయింది. అలాగే రాజధాని ఢిల్లీ మున్సిపాలిటీని కూడా కోల్పోయింది. ఓ రకంగా బిజెపికి ఇది పెద్ద దెబ్బగానే భావించాలి. మోడీ మేనియా ఢిల్లీలో, హిమాచల్‌లో పనిచేయలేదు. ఇది మోడీ వైఫల్యంగానే చూడాలి. మోడీ పాలన సక్రమంగా ఉంటే హిమాచల్ ప్రజలు మళ్లీ పట్టం కట్టేవారు. ఢిల్లీలో పాలన సక్రమంగా ఉండా మరోమారు పట్టం కట్టేవారు. కానీ ఇవి జరగలేదంటే మోడీపట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని గుర్తించాలి. అధికారంలో ఉన్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు రోజుల క్రితం బిజెపి ఓటమి పాలైంది. అలాగే మరుసటి రోజు జరిగిన లెక్కింపులో హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఓటమి పాలయ్యింది. గుజరాత్‌లో కేవలం ప్రధాని మోడీ మావాడన్న సెంటిమెంట్మేరకు మాత్రమే అధికారం నిలబెట్టుకున్నారని ఇక్కడ గుర్తించాలి. ముందునుండి ఊహించినట్టుగానే గుజరాత్‌లో బిజెపి అధికారాన్ని నిలబెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు ఆ పార్టీ అగ్రనేతలందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేసినా ప్రజలు బిజెపిని తిరస్కరించారు. హిమాచల్‌లో గురువారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని కట్టబెట్టారు. దీంతో హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి అధికారాన్ని కాంగ్రెస్ హస్తగం చేసుకుంది. గతంతో పోలిస్తే ఆ పార్టీకి సీట్లు కూడా పెరిగాయి. స్వరాష్ట్రం కావడంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు, హోంశాఖ మంత్రి అమిత్‌షా కూడా ఇక్కడ ఎన్నికల ప్రచారాన్ని వ్యక్తిగత ప్రతిష్టగా తీసుకున్న విషయం తెలిసిందే. అరవింద్ కేజీవ్రాల్ గుజరాత్‌లో అడుగుపెట్టడంతో బిజెపి గుజరాత్ ప్రైడ్‌ను ప్రచారం లోకి తీసుకొచ్చింది. గుజరాత్‌పై బయట వ్యక్తుల ఆధిపత్యం సహించరాదన్న చర్చ ప్రజల్లో తెరలేపింది. దీని ఫలితంగా బిజెపికి భారీ మెజార్టీ వచ్చిందని భావిస్తున్నారు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా గురువారం నాడే వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కమలదళానికి తీవ్ర భంగపాటు ఎదురైంది. దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వాటిలో ఒక లోక్‌సభతో పాటు నాలుగు అసెంబ్లీ స్థానాలను ప్రతిపక్షాలు కైవసం చేసుకున్నాయి. కేవలం రెండు శాసనసభ స్థానాల్లోనే బిజెపి గెలుపొందింది. అయితే, బిజెపితో పాటు కార్పొరేట్ మీడియా కూడా గుజరాత్ గెలుపునే భారీగా ప్రచారం చేస్తూ మిగిలిన ఫలితాలను ప్రజల దృష్టికి రాకుండా చేసే ప్రయత్నం చేశాయి. ఇక్కడ మరోవిషయం గమనించాలి. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా స్వరాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌లో ఆ పార్టీ గత ఎన్నికలతో పోలిస్తే తాజా ఎన్నికల్లో ఆరుశాతం ఓట్లను కోల్పోయింది. 60 స్థానాలున్న ఈ రాష్ట్ర శాసనసభకు 2017లో జరిగిన ఎన్నికల్లో 49.53 శాతం ఓట్లతో 44 స్థానాలను బిజెపి గెలుచుకుంది. గురువారం నాడు ఫలితాలు వెలువడిన తాజా ఎన్నికల్లో 43 శాతం ఓట్లతో 25 స్థానాలను మాత్రమే సొంతం చేసుకుంది. అదే సమయంలో గత ఎన్నికల్లో 42.32 శాతం ఓట్లతో 21 స్థానాలను గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ తాజా ఎన్నికల్లో 43.90 శాతం ఓట్లతో 40 స్థానాలను కైవసం చేసుకుంది. మొత్తంమీద కాంగ్రెస్‌కు గత ఎన్నికలతో పోలిస్తే 19 స్థానాలు అదనంగా లభించాయి. ఇది కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం నింపుతోంది. పార్టీలో ఉంటున్న వారు కావచ్చు.. కొత్తగా చేరాలనుకునే వారికి కూడా ఇది కొంత ఉత్సాహాన్ని ఇచ్చేదిగా ఉంది. అలాగే ప్రియాంక కూడా ప్రభావం చూపించే నాయకురాలిగా ఎదగడానికి అవకాశం ఏర్పడింది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అధికారాన్ని మార్చే అలవాటున్న హిమాచల్ రాష్ట్రంలో రెండవసారి కూడా తామే గెలుస్తామని బిజెపి ప్రకటించింది. మోడీ,అమిత్‌షా ద్వయం స్వయంగా ప్రచారంలోకి దిగి డబుల్ ఇంజన్ నినాదాన్ని ఇచ్చారు. మరోవైపు సీనియర్ నేత వీరభద్రసింగ్ మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీని నాయకత్వ సమస్య వెంటాడింది. అయినా, ఒక వ్యూహం ప్రకారం ప్రచారంచేయడంతో పాటు, స్థానిక అంశాలను, సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి హామీ ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ విజయధుంధుభి మోగించింది. భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్ గాంధీ ఇక్కడ ప్రచారానికి రాకపోవడంతో ప్రియాంకగాంధీ ముమ్మ రంగా పర్యటించారు. ఇక్కడ తొలిసారి పోటీ చేసిన ఆప్ ఒక్క స్థానంలో కూడా గెలవలేదు. గుజరాత్ విజయంతోనే దేశంలో బిజెపికి ఇక ముందు తిరుగుండదని, 2024లో అది తిరిగి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ప్రచారం చేస్తున్నారు.ఈ ప్రచారం గాలిని హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ నగర కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు తీసి వేశాయి. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పడిలేచిన కెరటమైంది. బిజెపి నుంచి అధికారాన్ని కైవసం చేసుకొన్నది.ఢిల్లీ నగర కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ అనూహ్య విజయాన్ని దక్కించు కుంది. అక్కడ బిజెపి ఆధిపత్యానికి తెర దించింది. హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్తాన్, పంజాబ్, ఢిల్లీలలో ఇప్పుడు బిజెపి అధికారంలో లేకపోడాన్ని గమనించాలి.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# యువతి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

### దుండగులను అరెస్ట్ చేసి..అమ్మాయికి రక్షణ



**రంగారెడ్డి, డిసెంబర్ 9 (సమ సమాజం):** జిల్లాలోని ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించిన కిడ్నాప్ కేసులో పోలీసులు ఎట్టకేలకు కిడ్నాపర్‌ను పట్టేసుకున్నారు. మాధ్యాహ్నం సమయంలో 100 మందితో వచ్చిన మిస్టర్ టీ ఓనర్ నవీన్ రెడ్డి.. నానా హంగామా చేసి.. అమ్మాయిని కిడ్నాప్ చేయటంతో.. ఈ కేసు నగరమంతా చర్చనీయాంశంగా మారింది. అయితే.. మధ్యాహ్నం నుంచి అమ్మాయిని ఎక్కడికి తీసుకెళ్లారు.. ఏం చేశారు.. అంటూ అమ్మాయి తరఫు బంధులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేశారు. అటు పోలీసులపై కూడా తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. నవీన్ రెడ్డికి సంబంధించిన ఆస్తులు కూడా ధ్వంసం చేశారు. చివరికి.. అమ్మాయి తన తండ్రి దామోదర్‌కి ఫోన్ చేసింది వైశాలి. తాను సిటీలోనే ఉన్నానని తెలిపిన వైశాలి.. సేఫ్‌గానే ఉన్నానని చెప్పింది. తన గురించి ఆందోళన చెందవద్దని చెప్పింది. దీంతో.. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు ఆమె ఉన్న చోటును గుర్తించారు. సినిమాల్లో చూపించిన విధంగా.. హుటాహుటిన వాళ్లున్న ప్లేస్‌కి వెళ్లి.. కిడ్నాపర్లను పట్టుకున్నారు. వైశాలిని వాళ్ల నుంచి రక్షించారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగుడాలో నివసిస్తున్న వైశాలి అనే యువతి.. డెంటల్ డాక్టర్‌గా పనిచేస్తుంది. కాగా.. వైశాలి ఇంటికి మిస్టర్ టీ ఓనర్ నవీన్ రెడ్డి వచ్చి దౌర్జన్యం చేశారు. దాదాపు 100 మంది రౌడీలతో కలిసి వచ్చి నానా హంగామా సృష్టించారు. ఇంట్లో ఉన్న ఫర్నిచర్ విరగ్గొట్టారు. యువతి ఇంటిని పూర్తిగా ధ్వంసం చేశారు. అనంతరం రౌడీలు వైశాలిని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అడ్డువచ్చిన యువతి తల్లిదండ్రులనే కాకుండా.. పక్కింటి వారిని కూడా తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో యువతీ తల్లిదండ్రులతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీళ్ల దౌర్జన్యంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర రావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించింది.. తమ సిబ్బందిని పలు బృందాలుగా విభజించి.. గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఈ కిడ్నాప్ కేసును తక్కువ సమయంలోనే ఛేధించారు. గతంలోనే నవీన్ రెడ్డిపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. అయినప్పటికీ యువతిని కొంతకాలంగా నవీన్ రెడ్డి వేధిస్తున్నాడని చెబుతున్నారు. నవీన్ రెడ్డి కొంతమంది మనుషులతో తమ ఇంటికి వచ్చి గొడవ చేస్తున్న సమయంలో పోలీసులకు, 100కు కాల్ చేసినా స్పందించలేదని యువతి తల్లిదండ్రులు ఉదయం ఆరోపించారు.

# విభజన సమస్యలను సాధించడంలో జగన్ వైఫల్యం



రెడ్డి జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విషబీజాలు నాటేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ,ఏపీ మళ్లీ కలవాలనే తాను కోరుకుంటున్నాను అన్న సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ, ఏపీ కలవాలని మాట్లాడటం.. వైసీపీ పాలన వైఫల్యమే అని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆడుతున్న నాటకాలన్నారు. అలా కలవాలంటే మద్రాస్ నుంచి విడిపోయిన ఎపి మళ్లీ కలుస్తుందా అని అన్నారు. కేంద్రాన్ని నిలదీసి సమస్యలును పరిష్కరించుకోలేక. .ప్రజలకు సమాదానం చెప్పుకోలేని స్థితిలో జగన్ ఉన్నారని జీవన్ రెడ్డి మండిపడ్డారు.

# దేశారాజకీయాల్లో కెసిఆర్‌తోనే మార్పు

### తెలంగాణ సాధనతో పాటు అభివృద్ధిలో నడిపారు ● కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



**హైదరాబాద్,డిసెంబర్ 9 (సమ సమాజం):** దేశ రాజకీయాల్లో మార్పు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నడుంకట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, జనతా దళ్ (సెక్యులర్) అగ్ర నేత హెచ్‌డి. కుమారస్వామి అన్నారు. దేశంలోభారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గుణాత్మకమైన మార్పు తీసుకు వస్తుందన్న నమ్మకం తనకు ఉందని ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలకు హాజరైన ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ఆమరణ నిరాహార దీక్షతో కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, ఇప్పుడు అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలిపారని కుమారస్వామి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా దళితబంధు, రైతుబంధు వంటి పథకాలను ప్రవేశ పెట్టారని, రికార్డు సమయంలో నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేశారని ఆయన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రశంసించారు. కేసీఆర్ ఆలోచనాధోరణి, ఆయన చిత్తశుద్ధి అద్భుతమని కొనియాడారు. ఈ సందర్భంగా తాను రెండోసారి తెలంగాణ భవన్‌కు వచ్చానని ఆయన తెలిపారు. మొదటిసారి దసరా రోజు వచ్చినప్పుడు బీఆర్ఎస్ పేరుకు అంకురార్పణ జరిగిందని, రెండోసారి వచ్చినప్పుడు ఎన్నికల సంఘం నుంచి బీఆర్ఎస్‌కు గుర్తింపు రావడంతో ఆవిర్భావ వేడుకలు జరుగుతున్నాయని కుమారస్వామి గుర్తు చేసుకున్నారు. అంతేకాదు కర్నాటకలో జనతాదళ్‌తో కలిసి నడుస్తామని ప్రకటించినందుకు కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశ రక్షణ కోసం జనతాదళ్ (ఎస్) కేసీఆర్ వెంటే ఉంటుందని కుమారస్వామి స్పష్టం చేశారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ గురుకులాలు

### విద్యార్థులను అభినందించిన మంత్రి సత్యవతి



**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అనేక ఉన్నతమైన కాలేజీల్లో సీట్లు సంపాదిస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వారు ఉన్నత విద్యావంతులు కావడానికి గురుకులాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ప్రైవేటుకు దీటుగా గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని మంత్రి సత్యవతి అన్నారు. తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. గిరిజన బిడ్డలను విద్యావంతులను చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడకముందు 91 గిరిజన గురుకులాలు మాత్రమే ఉండేవని, టీఆర్ఎస్ ప్రభుత్వం మరో 92 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ సీట్లు సాధించిన గిరిజన గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే గిరిజనుల్లో అక్షరాస్యత శాతం ఇప్పుడు అత్యధికంగా పెరిగిందన్నారు. గిరిజనులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో నోటిఫికేషన్

### 1392 జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీ

**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** టీఎస్పీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్ రిలీజైంది. 1392 జూనియర్ లెక్చరర్ల పోస్టులకు టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా జేఎల్ పోస్టులకు నోటఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి జనవరి 6 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది. జున్ లేదా జూలైలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. చివరిసారి 2008లో జేఎల్ నోటిఫికేషన్ రిలీజైంది. అయితే పలు సంఘటనల తర్వాత 2012లో ఈ పోస్టులను భర్తీ చేశారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 457 జేఎల్ పోస్టులను అప్పట్లో భర్తీ చేశారు. ఆ తర్వాత మళ్లీ జేఎల్ పోస్టుల భర్తీ జరగలేదు. ఈ నేపథ్యంలో జేఎల్ పోస్టుల కోసం ఈసారి అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటీపడే అవకాశం ఉంది.

# తెలంగాణ భవన్ పరిసరల్లో ట్రాఫిక్ జామ్

### వాహనాలు నిలిచిపోవడంతో సామాన్యుల ఇక్కట్లు

**డిసెంబర్ 9 (సమ సమాజం): డిసెంబర్ 9 (సమ సమాజం):** బిఆర్ఎస్ భవన్‌లో ఆవిర్భావ వేడుకల సందర్బంగా ఎన్టీఆర్ భవన్ నుంచి తెలంగాణ భవన్ వరకు ఫుల్ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలతో టీఆర్ఎస్ లీడర్ల కార్లు రోడ్డు పైనే పెట్టేశారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సుమారు రెండు గంటల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. పోలీసులు కూడా పెద్దగా దీనిని పట్టించుకోక పోవడంతో సామాన్య ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇక తెలంగాణ భవన్ ముందు సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు అంతా తెలంగాణభవన్ లోనే ఉండటంతో.. కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలంగాణ భవన్ కు చేరుకుంటున్నారు. మరోవైపు.. ఇప్పటికే జూబ్లీహిల్స్ రూట్ లో డైవర్షన్స్ తో జనం అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ క్లియరెన్స్ పై పోలీసులు దృష్టి పెట్టడం లేదని వాహనదారులు విమర్శలు చేసారు. ఏదైనా అత్యవసరం ఉన్నవారు వేరే రూట్లో వెళ్లడం మంచిదని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

# తెలంగాణతో పేగుబంధం లేని కెసిఆర్

### ఇప్పుడు పేరు బంధం కూడా తెంచుకున్నారు

### బిఆర్ఎస్ ఆవిర్భావంపై రేవంత్ విమర్శలు



**డిసెంబర్ 9 (సమ సమాజం): డిసెంబర్ 9 (సమ సమాజం):** కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్‌కు ఏనాడూ తెలంగాణతో పేగు బంధంలేదని, టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారడంతో పేరు బంధం కూడా లేకుండా పోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ పార్టీ పేరు బీఆర్ఎస్ గా మార్చడంపై ఎలక్షన్ కమిషన్ అభ్యంతరాలు చెప్పాలని అడిగిందని, అయితే తాను సీఈసీని కలిసేందుకు వెళ్తే కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వలేదని రేవంత్ వాపోయారు. పీసీసీ చీఫ్, ఎంపీగా ఉన్న తనను కలిసేందుకు సీఈఓకు వీలుపడలేదని విమర్శించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేసి బీఆర్ఎస్‌గా మార్చిందని, కేసు పెండింగ్‌లో ఉన్నందున పేరు మార్చేందుకు వీల్లేదని అన్నారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేశానని రేవంత్ స్పష్టం చేశారు. ఓట్లను చీల్చేందుకే బీజేపీ టీఆర్ఎస్‌ను వాడుకుంటోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అక్రమాలపై, బంగారు కూలీపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బంగారు కూలీ పేరుతో వందల కోట్లు వసూల్ చేసిన పార్టీ ఆ లెక్కలు ఎక్కడా చూపించలేదని అన్నారు. దీనిపై అన్ని దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ ఏపీ, తెలంగాణను తిరిగి కలిపే ప్రయత్నం చేస్తున్నాడని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. రెండు రాష్ట్రాలను కలిపే విషయంలో గురువారం సజ్జల మాట్లాడిన మాటల్ని తేలికగా తీసుకోవద్దని చెప్పారు. సజ్జల కామెంట్స్‌ను టీఆర్ఎస్ నేతలు కనీసం ఖండించలేదంటేనే అర్థం చేసుకోవాలని అన్నారు. సజ్జల మాటల వెనుక కేసీఆర్ ప్రమేయం ఉందని విమర్శించారు. ఏపీ, తెలంగాణ తిరిగి కలిసిపోతే రెండు రాష్ట్రాల్లో పోటీ చేయొచ్చని కేసీఆర్ భావిస్తున్నారని రేవంత్ ఆరోపించారు.

# ఎర్రకోటపై ఎగిరేది గులాబీ జెండానే

### అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' ..అదే మా నినాదం ● కర్నాటక నుంచే మా ప్రస్థానం మొదలు ● 14న ఢిల్లీలో పార్టీ కార్యాలయం ప్రారంభం ● బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంలో కెసిఆర్ ప్రకటన



**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగిరేది గులాబీ జెండానే అని సీఎం కేసీఆర్ అన్నారు.'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' అనేది భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) నినాదమని చెప్పారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా పార్టీ మారడంతో తెలంగాణ భవన్ లో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో జెండాను ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. ఈ నెల 14న ఢిల్లీలో బీఆర్ఎస్ భవనాన్ని ప్రారంభిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. త్వరలోనే పార్టీకి సంబంధించిన జాతీయ పాలసీలు రూపొందిస్తామని తెలిపారు. దేశ పరివర్తన కోసమే బీఆర్ఎస్ ఏర్పడిందన్న కేసీఆర్... కర్ణాటకలో బీఆర్ఎస్ తరపున ప్రచారం నిర్వహిస్తామన్నారు. కర్ణాటకకు కుమార స్వామి సీఎం కావాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో గెలవాల్సింది రాజకీయ పార్టీలు కాదని ప్రజలు గెలవా లని కేసీఆర్ అన్నారు. దేశానికి ఇప్పుడు కొత్త ఆర్థిక విధానం అవసరమని చెప్పారు. మహిళా సాధికారత కోసం కొత్త జాతీయ విధానం తీసుకొస్తామని తెలిపారు. ఇకపై రాష్ట్రాల మధ్య జల యుద్ధాలు ఉండవన్నారు. ప్రస్తుతం దేశం తప్పుడు విధానాలతో అల్లాడిపోతోందని చెప్పారు. తన ప్రతి ప్రస్థానంలో అవహేళనలు సర్వసాధారణమని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కేసీఆర్ అన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం టీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సమయంలోనూ చాలామంది చాలా రకాలుగా ఎన్నో విమర్శలు చేశారని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి రాష్టాన్ని సాధించామని చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలతోనే భారత రాష్ట్ర సమితి రాజకీయ ప్రస్థానం ప్రారంభం అవుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. రాబోయే కర్నాటక ఎన్నికల్లో బీఆర్ఎస్ జేడీఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతునిస్తూ ప్రచారంలో పాల్గొంటాం అని పేర్కొన్నారు. మన రాష్ట్ర సరిహద్దులో ఉన్న కర్నాటక ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొని, జేడీఎస్ పార్టీని గెలిపించి కుమారస్వామిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. అందుకు తెలంగాణలో అమలవుతున్న విద్యుత్, వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం తదితర పథకాలను వారికి వివరిద్దాం అని సూచించారు. గతంలో కర్నాటక పోయినప్పుడు చెప్పినట్టే కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. భగవంతుని కృపతో, మన పట్టుదలతో మరోసారి సీఎం అవుతాడనే విశ్వాసం ఉందని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ జాతీయ రాజకీయ ప్రస్థానం కర్నాటకతోనే ప్రారంభం అవుతుందని సీఎం ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు మనం తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరుతో ప్రజల్లోకి పోయి సాధించుకున్నాం అని కేసీఆర్ గుర్తు చేశారు. నేడు భారతదేశ అభివృద్ధి గుణాత్మక మార్పు లక్ష్యంగా భారత రాష్ట్ర సమితిగా పరిణామం చెందడం చారిత్రక అవసరం అని కేసీఆర్ నొక్కి చెప్పారు. బీఆర్ఎస్ అనే వెలుగుదివ్వెను దేశం నలుమూలలకు వ్యాపింప చేద్దాయమని అన్నారు. తెలంగాణ కీర్తి కిరీటాన్ని భరతమాత పాదాల ముందు పెట్టి దేశ ప్రతిష్టను ద్విగుణీకృతం చేసి భరతమాత సంతృప్తి చెందేలా బీఆర్ఎస్‌తో మన ప్రయాణం కొనసాగిద్దాం అని కేసీఆర్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 14వ తేదీన ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించుకుందాం అని కేసీఆర్ తెలిపారు. అదే రోజు బీఆర్ఎస్ పార్టీ జాతీయ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. పార్టీ ముఖ్యులంతా 13వ తేదీ సాయంత్రానికి ఢిల్లీ చేరుకోవాలి. మరో రెండు మూడు నెలల్లో మన సొంత బీఆర్ఎస్ భవనం పూర్తవుతుంది. అక్కడి నుంచే పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చు అని కేసీఆర్ పేర్కొన్నారు.

# తెలంగాణకు టీఆర్ఎస్ పీడ విరగడ



(మొదటి పేజి తరువాయి) ముఠాలా బయల్దేరారని ఆరోపించారు. దేశంలో పార్టీ పెట్టినప్పుడు.. రాష్ట్రంలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఎన్ని ఇండ్లు ఇచ్చింది..? డబుల్ బెడ్రూం ఇండ్లు ఎన్ని ఇచ్చారో కేసీఆర్ లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ఃరాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు ఏం నెరవేర్చారో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఇటీవల పంజాబ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి బండారం బయట పెడతానని..కేసీఆర్ చేసింది దొంగ దీక్ష అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మోసం చేసినవ్.. ఇక దేశాన్ని మోసం చేయాలనుకుంటున్నవా అంటూ మండిపడ్డారు. మిషన్ భగీరథ పైపులు కేసీఆర్ ఫ్యాక్టరీ నుంచే వస్తాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాగానే గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకం తీసుకొస్తామని బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో రంగు రంగుల జెండాలు పోవాలని.. డబుల్ ఇంజన్ సర్కార్, కమలం వికసించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే అందరికి ఉచిత విద్య, వైద్యం అందిస్తామన్నారు. నిలువ నీడ లేని పేదలకు ఇళ్ళు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో తేమ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని..ఎరువులకు కేంద్రం సబ్సిడీ ఇస్తోందన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ తెరిపించిన ఘనత మోడీదని అన్నారు. అలాగే ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ మీరు తెరిపిస్తారా.. మేము తెరిపించాలా..? అంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ చేశారు. కొండగట్టు ప్రమాద బాధితులకు ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని బండి సంజయ్ ఆరోపించారు. కేసీఆర్ వాళ్ళ గురించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముప్పై గ్రామాలకు సరిపోయేంత కరెంట్‌ను ఫామ్ హౌస్ లో కేసీఆర్ వాడుతున్నారని విమర్శించారు. మెట్రో పక్కన తన భూములకు ధరలు రావాలని..కేసీఆర్ మళ్లీ మెట్రో కావాలని అంటున్నారని బండి సంజయ్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర జగిత్యాల జిల్లాలో కొనసాగుతోంది. ఇవాళ 12వ రోజు పాదయాత్రను కోరుట్ల మండలం వేంపేట నుంచి ప్రారంభించారు. ఈ క్రమంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని.. రైతు ఉద్యమ నాయకులు బద్దం శ్రీనివాస్ రెడ్డి సంజయ్ కి వినతి పత్రం సమర్పించారు. పసుపుకు క్వింటాల్ కు 15 వేల మద్దతు ధర కల్పించాలని, చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చొరవ తీసుకోవాలని విజజప్తి చేశారు. వరి ధాన్యం తూకంలో జరుగుతున్న మోసాలపై, రైతుల అక్రమ అరెస్టులపై ప్రభుత్వాన్ని నిలదీయాలని రైతు నేతలు బండి సంజయ్ ని కోరారు.

# బిఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక పూజలు




(మొదటి పేజి తరువాయి) మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తెలంగాణ భవన్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు.తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఇప్పుడు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారింది. 21 ఏండ్ల అనుభవం, 60 లక్షల మంది సుశిక్షితులైన సైనికులు కలిసి భారతదేశ తలరాతను మార్చేందుకు నడుం బిగించారు. 'తెలంగాణను ఏ విధంగానైతే అభివృద్ధి చేసుకొన్నామో.. అదే విధంగా దేశాన్ని బాగుచేసుకొనేందుకు కదులుదాం' అని సీఎం కేసీఆర్ దసరా రోజు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. 'మన పార్టీ పేరు ఇకపై భారత రాష్ట్ర సమితి' అని నాడు ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. పేరు మార్పును ఆమోదిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు గురువారం లేఖ రాసింది. దీంతో టీఆర్ఎస్ నేటి నుంచి బీఆర్ఎస్‌గా అవతరించింది.

## తెలంగాణను చక్కదిద్దలేని కెసిఆర్ ఢిల్లీని ఏలుతాడా?



మరోమారు సెంటిమెంట్‌తో మోసం చేసే ఎత్తుగడలు

నల్లగొండలో ప్రజాగోస-బిజెపి భరోసా యాత్రలో ఈటెల

**నల్గొండ, డిసెంబర్ 9 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రాన్ని చక్కదిద్దే సత్తా లేదుగాని, దేశాన్ని బాగు చేస్తానని కెసిఆర్ అంటున్నాడని అని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేసీఆర్ ప్రభుత్వంపై ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడే కేసీఆర్‌కు తెలంగాణకు బంధం తెగిపోయిందన్నారు. టీఆర్ఎస్ పార్టీ, సజ్జల రామకృష్ణారెడ్డి కూడ బలుక్కుని మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌లో లేవనెత్తుతున్నారు. ఆ సెంటిమెంట్‌తో మళ్ళీ తెలంగాణ ప్రజల్ని కేసీఆర్ మోసం చేయలేరని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.కేసీఆర్ ప్రభుత్వం 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతిపక్ష పార్టీల మీద దాడులు చేస్తూ సమస్యల పరిష్కారాన్ని పక్కదోవ పట్టిస్తుందని విమర్శించారు. సురక్షితంగా సుభిక్షంగా పాలించే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని గుజరాత్ ఎన్నికలు మరోసారి నిరూపించాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండా మాత్రమే అని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లాలో గ్రామ గ్రామాన ప్రజా భరోసా యాత్రతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. నల్గొండ నియోజకవర్గంలో నిర్వహించే ప్రజాగోస – బీజేపీ భరోసా యాత్ర బైక్ ర్యాలీని ఈటల ప్రారంభించారు. అనంతరం పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 32 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



(మొదటి పేజి తరువాయి) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తలకోన సౌత్ ఫారెస్ట్, అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలో చేసుకున్నట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు రిజర్వ్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి రెండు టీంలుగా గురువారం శేషాచలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించినట్లు తెలిపారు. భాకరాపేట రేంజ్ పరిధిలోని ఎర్రవారిపాలెం మండలం తలకోన సౌత్ వీటిలో కూంబింగ్ చేపట్టగా మునెద్దుల మడుగు వద్ద కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం కొయ్యలను మోసుకొని వస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు స్మగ్లర్లను చుట్టుముట్టే ప్రయత్నం చేయగా 21 ఎర్రచందనం కొయ్యలును కింద పడి వేసి చీకట్లో పారిపోయారని పోలీసులు తెలిపారు. అదే టాస్క్ ఫోర్స్ విశ్వనాధ్ టీం తిరుమల చేరుకొని తిరుపతి డౌన్ గాట్ రోడ్డు వైపు కూంబింగ్ చేపట్టగా అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలో తిమ్మనాయుడుపాలెం సెక్షన్ సన్నరాల మిట్ట వద్ద కొందరు పోలీసులను చూసి 11 ఎర్రచందనం దుంగలను కింద పడేసి పారిపోయినట్లు తెలిపారు. రెండు చోట్ల కలిపి 32 ఎర్రచందనం కొయ్యలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొరికిన ఎర్రచందనం కొయ్యలు బరువు 987 కిలోలు ఉండగా వీటి విలువ సుమారు 50 లక్షలు ఉంటుందని ఎస్పీ చక్రవర్తి తెలిపారు. పారిపోయిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇక మెట్రో



(మొదటి పేజి తరువాయి) జనాభాలో పెద్దదిగా ఉన్న నగరం హైదరాబాద్. ఇది చరిత్ర చెప్తున్నటువంటి సత్యం. హైదరాబాద్ నగరంలో చెన్నై కంటే దేశంలోని అనేక ఇతర నగరాల కంటే ముందుగా 1912లోనే ఎలక్ట్రిసిటీ వచ్చిన నగరం. మనకు 1912లో కరెంట్ వస్తే చెన్నై నగరానికి 1927లో అక్కడ కరెంట్ రావడం జరిగింది. చరిత్రలో నిజమైన కాస్మోపాలిటన్ సిటీగా అన్ని వర్గాలను, కులాలను, మతాలను, ప్రాంతాలను, జాతులను అందర్నీ అక్కున చేర్చుకోని అద్భుతమైనటువంటి విశ్వనగరంగా ఉన్న హైదరాబాద్ ఈ రోజు ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ కోసం మెట్రోకు శంకుస్థాపనం చేసుకోవడం సంతోషంగా ఉందని సిఎం కెసిఆర్ అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్, హెచ్ఎండీఏ, మెట్రో రైలు వారిని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు వారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం చరిత్రలోనే గొప్పది కాదు. వర్తమానం లో కూడా చాలా గొప్పది. దేశంలో ఏ నగరంలో లేనటువంటి సమశీతల వాతావరణం ఉంది. భూంకపాలు రాకుండా, భూగోళం మీదనే సేఫేస్ట్‌గా ఉండే నగరం హైదరాబాద్. అన్ని భాషలు, సంస్కృతులు కలిగిన ఉన్నవారు ఉన్నారు. అనేక రాష్ట్రాలు, దేశాల నుంచి ఈ నగరంలో సహజీవనం సాగిస్తున్న సంగతి తెలుసు. గుల్జార్ హౌస్ వద్ద 300 సంవత్సరాల క్రితం వచ్చినటువంటి ప్రజలు ఉన్నారు. ఈ కల్చర్ మన సొంతం. గతంలో హైదరాబాద్ నగరం గొప్పగా ముందుకు పోలేదు. సమైక్య పాలకుల వల్ల చాలా బాధలు అనుభవించాం. మాకు కరెంట్ ఇవ్వండి, సరిపోవడం లేదు. వర్కర్స్ బాధపడ్డారు. వేరే రాష్ట్రాలకు వెళ్లిపోతాం అని పారిశ్రామిక వేత్తలు ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేశారు. హైదరాబాద్‌లో ఏ బస్తీకి వెళ్లినా చాలా భయంకరమైన మంచినీటి బాధలు చూశాం...అనుభవించాం. కృష్ణా, గోదావరి నుంచి నీటి సరఫరా పనులు నత్తనడకన నడిచాయి. అవన్నీ క్లియరెన్స్‌లు సాధించి మంచినీటి వసతి ఏర్పాటు చేసుకున్నాం. క్షణం పాటు కరెంట్ పోని పరిస్థితి చేసుకున్నాం. హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్‌గా మార్చాం. హైదరాబాద్ నగరం పవర్ సెక్టార్‌లో అనుసంధానం అయింది. న్యూయార్క్, లండన్, పారిస్‌లో కరెంట్ పోవచ్చు కానీ హైదరాబాద్‌లో మాత్రం కరెంట్ పోదు. ఇటువంటి అద్భుతమైన నగరంగా తయారు అవుతోంది అని కేసీఆర్ పేర్కొన్నారు. గొప్ప గొప్ప పరిశ్రమలు హైదరాబాద్‌లో కొలువుదీరు తున్నాయి. పరిశ్రమల రంగంలో ముందుకు దూసుకుపోతున్నాం. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లతో ట్రాఫిక్ కష్టాలు తీర్చుకుంటున్నాం. ఆఫీస్ స్పేస్, రియల్ ఎస్టేట్ రంగంలో నిబంధనలు సడలించడంతో నిర్మాణం రంగం పుంజుకుంది. చాలా గొప్పగా ముందుకు పురోగమిస్తున్నాం. ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రెండో రన్ వే కూడా వస్తుంది. ఆ విధంగా ఈ మెట్రో రైలు కనెక్టివీటి ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసుకుని అందుబాటులోకి తీసుకువస్తామని కెసిఆర్ ప్రకటించారు. పేదల ఆధీనంలో ఉన్న భూముల గురించి వెసులుబాటు కావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే కోరారు. ఆ సమస్యను కూడా పరిష్కారం చేస్తాం. కరోనా వల్ల వెసులుబాటు తగ్గినప్పటికీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. ప్రపంచంలో కాలుష్య రహితమైనటువంటి, ట్రాఫిక్ రద్దీని నివారించగలిగేటువంటి ఏకైక మార్గం మెట్రో. హైదరాబాద్ లో ఇంకా విస్తరించాల్సి ఉంది. బీహెచ్ఈఎల్ నుంచి మెట్రో రావాల్సి ఉంది. హైదరాబాద్ చుట్టూ మెట్రో రావాల్సి ఉంది. కేంద్రం సహకారం ఉన్నా లేకున్నా ఆ సౌకర్యాలు కలిగించుకుంటాం అని కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగర ఎమ్మెల్యేలు, మంత్రులు, ముందుకు పురోగమిస్తున్నారు. కేటీఆర్ ఆధ్వర్యంలో మరిన్ని విజయాలు సాధించాల్సిన అవసరం ఉంది. అద్భుతమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేస్తుంది వెనుకాడదు. ప్రపంచలోనే ఒక అద్భుతమైన నగరంగా పేరు ప్రఖ్యాతులు కలిగిన ఉన్న హైదరాబాద్ ను మరింత తీర్చుదిద్దుతాం. పచ్చదనంలో మనం పురోగమించాం. వరల్డ్ గ్రీన్ సిటీ బెస్ట్ అవార్డు మనకే రావడం జరిగింది. ఇంకా ఎన్నో అవార్డులు హైదరాబాద్ సొంతం అయ్యాయి. ఫతుల్లాగూడలో నిర్మించిన స్మశాన వాటిక అద్భుతంగా ఉందని చెప్తే గర్వపడ్డాను. మనం ఎంత చేసినా ఇంకా తక్కువే. చాలా మంది లక్షల సంఖ్యలో హైదరాబాద్ జనాభాను పెంచుతున్నారు. తగురీతిలో మురుగునీటి, మంచినీటి సదుపాయాలు కల్పించుకోవాలి. జనాభా పెరుగులదకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుకోవాలి. ప్రాథమిక అవసరాల్లో ముందు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం, ఆర్థిక ప్రేరణ ఇస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని, కెటిఆర్, మహ్మూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి,ఎంపిలు కేశవరావు, రంజిత్ రెడ్డి,మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహం వద్ద షర్మిల హంగామా

**పాదయాత్రను అడ్డుకోవడంపై మండిపాటు ● అరెస్ట్ చేసి ఇంటికి తరలించిన పోలీసులు**



**హైదరాబాద్, డిసెంబర్ 9 (సమ సమాజం):** వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజా ప్రస్థాన పాదయాత్రకు అనుమతి నిరాకరించడంపై షర్మిల నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్యాంక్ బండ్ పె అంబేదుర్ విగహం ఎందుకు ఆటంకాలు కల్పిస్తున్నారని ప్రశ్నించారు.ఈ తరుణంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చారు. దీంతో షర్మిలకు సంఘీభావం తెలిపేందుకు అక్కడకు పెద్ద సంఖ్యలో వైఎస్సార్టీపీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందు ఆమె దీక్షకు దిగారు. అనుచరులతో కలసి హంగామా సృష్టించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి లోటస్ పాండ్‌కు తరలించారు. షర్మిల లోటస్ పాండ్ వద్ద దీక్ష కొనసాగిస్తూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేశారని విమర్శలు చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్నారని ఆరోపించారు. తన పాదయాత్రకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే యాత్రను అడ్డుకున్నారన్నారు. పాదయాత్రకు అనుమతి నిరాకరించడంపై షర్మిల నిరసన తెలిపారు. ఈ క్రమంలో షర్మిల మాట్లాడుతూ తన పాదయాత్రను ఆపేందుకు కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని, తన పాదయాత్రకు హైకోర్టు పర్మిషన్ ఉన్నప్పటికీ కేసీఆర్ న్యాయస్థానాన్ని కూడా అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర చేస్తే మీకు వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్టీపీ అంటే భయం లేకపోతే పాదయాత్రను ఎందుకు అడ్డుకుం టున్నారన్నారు. ఇప్పటికే 85కు పైగా నియోజకవర్గాలను దాటచ్చామని. ఇప్పుడు తమకు అడుగడుగునా

# మోడీని ఢిల్లీ ప్రజలే ఛీత్కరించారు



(మొదటి పేజి తరువాయి) టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఢిల్లీ మున్సిపాలిటీలో ఓటమి పాలైందని చెప్పారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ మున్సిపాలిటీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఉప ఎన్నిక జరిగితే గుజరాత్ తప్ప అన్ని చోట్ల బీజేపీ ఓడిపోయిందని అన్నారు. అయినా అన్నింట్లో గెలిచినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. హిమాచల్ ప్రదేశ్ ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటేసి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని రేవంత్ చెప్పారు. అయితే బీజేపీ అనుకూల మీడియా మాత్రం కాంగ్రెస్ గెలుపును చిన్నది చేసి చూపే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ మెగా రక్తదాన శిబిరం, పేదలకు బట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రమాద బీమా ఇస్తున్నామన్న ఆయన.. ఇవాళ 100 కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశామని అన్నారు. ఏఐసీసీ సెక్రటరీ నదీమ్ జావేత్ తో పాటు మాజీ మంత్రులు, ఇతర నేతలు సోనియా పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సోనియా గాంధీ జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయగా.. పలు చోట్ల వృద్ధాశ్రమాలకు వెళ్లి అక్కడి వారికి తమ వంతు సేవలు అందించారు. ఇంకొన్ని చోట్ల అన్నదాన, రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోని బోయిన్?పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావిద్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మల్లు రవి ప్రారంభించారు. రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలను రేవంత్ రెడ్డి అభినందించారు




# చలన చిత్రం



## బికినీలో మత్తెక్కిస్తున్న దీపిక

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణెలి వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంటోంది. పఠాన్..జవాన్..ప్రాజెక్ట్-కె...రైటర్ చిత్రాలతో ఊపిరాడనంత బిజీగా ఉంది. గెహ్రాయాన్ లో తనదైన హాట్ పెర్ఫార్మెన్స్ తో చెలరేగిన తర్వాత అమ్మడిని మళ్లీ వెండి తెరపై చూడాలని అభిమానులంతా తహతహలాడిపోతున్నారు. సర్కస్’ చిత్రంలో రణవీర్‌తో తెరను పంచుకున్నా? అందులో దీపిక ఊసురు మనిపించింది. ఎలాంటి రొమాన్స్‌కి తావు ఇవ్వకుండా కేవలం పెర్ఫార్మెన్స్ తోనే ఆకట్టుకుంది. హబ్బీతో ఐంట పాటలో రెచ్చిపోతుందను కున్నారంతా? కానీ అక్కడ సీన్ రివర్స్ లో కనిపించింది. ఇక ఆశలన్నీ పఠాన్ పైనే కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఓ సాంగ్ లో బికినీ ధరించి కనిపించింది. ఆ పాటపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ సినిమాలోని ’బేషరమ్ రంగ్’ సాంగ్ డిసెంబర్ 12న విడుదల కానుంది. ఈ పాటలోని ఒక స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. దీపిక గోల్డెన్ బికినీలో అగ్గి రాజేసే అందాలతో వావ్ అనిపిస్తుంది. స్టిల్ చూసిన తర్వాత కా÷-టకెయిల్లోని పాతకాలపు దీపికనే స్మరిస్తుంది. అమ్మడి తడిపోడి అందాలు హైలైట్ అవుతున్నాయి. దీపిక స్కిన్ టోన్..పాల నురుగుల అందానికి అంతా ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట సంచలనంగా మారింది. కవర్ పేజీ స్టిల్ తరహాలో పఠాన్ స్టిల్ అభిమానుల్లో మంటలు పుట్టిస్తుంది. సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో విలన్గా జాన్ అబ్రహం నటిస్తున్నాడు. ఈ సినిమా జనవరి 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

## అవతార్-2 అద్భుత సృష్టి







ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం ’అవతార్-2’. 2009లో వచ్చిన ’అవతార్’కు సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. లెజెండరీ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టికి ఫిదా కాని ప్రేక్షకుడు లేడు. పండోరా అనే కొత్త గ్రహాన్ని సృష్టించి, ఆ లోకంలోకి మనల్ని కూడా తీసుకెళ్ళాడు. కలెక్షన్ల పరంగానే కాదు అవార్డుల పరంగా కూడా ఈ చిత్రం సంచలనం సృష్టించింది. దాదాపు 13ఏళ్ళ తర్వాత అవతార్-2 తెరకెక్కింది. జేమ్స్ కామెరూన్ ఈ సినిమా సీక్వెల్‌ను సముద్రగర్భంలో ఆవిష్కరించాడు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్‌లు ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు నెలకొల్పాయి. ఇదిలా ఉంటే ఈ సినిమా రిలీజ్‌కు ముందే రికార్డులు సృష్టించింది. అవతార్: ది వే ఆఫ్ వాటర్ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌తో ఇండియాలో సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే ఇండియాలో ఈ సినిమాకు రూ.10 కోట్లు వచ్చాయట. ఈ రికార్డు గతంలో డాక్టర్ స్ట్రేంజ్ పేరిట ఉండేది. ఇక తాజాగా ఈ రికార్డును అవతార్ బ్రేక్ చేసి రికార్డు క్రియేట్ చేసింది. రిలీజ్‌కు ముందే ఇలా రికార్డులు సాధిస్తే రిలీజ్ తర్వాత మరెన్నీ సంచలనాలు సృష్టిస్తుందో ప్రేక్షకులు భావిస్తున్నారు. భారీ స్థాయిలో బిజినెస్ జరిగినట్లు తెలుస్తుంది. కొన్ని హాలీవుడ్ న్యూస్ ప్రకారం ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బ్రేక్ ఈవెన్ కావాలంటే 2బిలియన్ డాలర్లు సాధించాల్సి ఉంటుందని టాక్. ఈ సినిమా దాదాపు 160 దేశాల్లో డిసెంబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## మరో హారర్ మూవీ కనెక్ట్‌తో వస్తోన్న నయనతార




హారర్ మూవీస్‌తో ప్రేక్షకులను మరోసారి భయపెట్టడానికి వస్తోన్న లేడీ సూపర్ స్టార్ నయనతార. ఇప్పటికే పలు హారర్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న నయన్.. తాజాగా కనెక్ట్ మూవీతో ప్రేక్షకులకు రాబోతున్నారు. ’మయూరి’, ’గేమ్ ఓవర్’ లాంటి సినిమాలు రూపొందించిన అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో రౌడీ పిక్చర్స్ బ్యానర్‌పై నయనతార స్వయంగా నిర్మిస్తున్న కనెక్ట్ చిత్రం ట్రైలర్ రిలీజైంది. ఇందులో చెప్పకోదగిన విషయం ఏమిటంటే ఇంటర్వెల్ లేకుండా 99నిమిషాలలో ఈ చిత్రాన్ని రూపొందించారు. డిసెంబర్ 22న థియేటర్లలో విడుదల కానున్న కనెక్ట్... తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. చిత్ర నిర్వాహకులు అర్థరాత్రి ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ ను విడుదల చేశారు. 2.22 నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్.. ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ట్రైలర్ మొదటి నుంచి చివరి వరకు టెన్షన్ ఫీలింగ్ ను కలిగిస్తోంది. ఈ ట్రైలర్ ప్రకారం... కరోనా లాక్ డౌన్ సమయంలో నయన తార ఆన్‌లైన్ మీటింగ్‌లో పాల్గొంటుంది. అదే సమయంలో మీటింగ్ లో పాల్గొన్న వారికి ఎవరో తెలియని వ్యక్తి గొంతు వినిపిస్తుంది. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు.. ? ఎవరు చేస్తున్నారు ఆ పని.. అసలెందుకు చేస్తున్నారు అన్న విషయాలను ఈ సినిమాలో చూపించినట్టు తెలుస్తోంది. అనుపమ్ ఖేర్ సైకియాట్రిస్ట్ పాత్రలో మెప్పించబోతున్నట్టు తెలుస్తోంది. ప్రయోగాత్మకంగా తెరకెక్కిన ఈ సినిమాలో ఇంటర్వెల్ లేకుండా తీయడంతో సినీ అభిమానులు రిలీజ్ కోసం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## పవన్ హరీష్ శంకర్‌ల కాంబినేషన్

### తేరీ రీమేక్ సన్నాహాల్లో డైరెక్టర్

రెండు రోజుల ముందు ప్రకటించిన పవన్-సుజీత్ సినిమా ఎంత ట్రెండ్ అయిందో.. ఇప్పుడు పవన్-హరీష్ శంకర్ సినిమా అంతకంటే ఎక్కువే ట్రెండ్ అవుతుంది. అయితే సుజీత్ సినిమా పాజిటీవ్‌గా ట్రెండ్ అయితే, హరీష్ శంకర్ సినిమా మాత్రం నెగెటీవ్‌గా ట్రెండ్ అవుతుంది. దానికి కారణం కూడా లేకపోలేదు. కొన్ని నెలల క్రితం హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్‌తో ’భవదీయుడు భగత్ సింగ్’ సినిమాను అనౌన్స్ చేశారు. అయితే ఈ సినిమాకు ఎక్కువగా సమయం కేటాయించాల్సి ఉంటుంది. పవన్ ప్రస్తుతం ఓ వైపు సినిమాలు చేస్తూనే.. మరో వైపు రాజకీయాలతో బిజీగా ఉన్నాడు. దాంతో ఈ ప్రాజెక్ట్‌కు బ్రేక్ పడింది. ఆ తర్వాత హరీష్ వేరో హీరో కోసం వెతుకులాట మొదలు పెట్టాడని గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజాగా హరీష్ శంకర్ తన తదుపరి సినిమాను పవన్‌తో చేస్తున్నట్లు ప్రకటించాడు. అయితే ఈ ప్రకటన పవన్ ఫ్యాన్స్‌ను భయపెడుతుంది. అదేంటి అనుకుంటున్నారా? హరీష్ శంకర్, పవన్‌తో ’భవదీయుడు’ ప్లేస్‌లో ’తేరి’ రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఫ్యాన్స్ భయపడటానికి కారణం కూడా ఉంది. ’తేరి’ సినిమాను దిల్‌రాజు ’పోలీసోడు’ పేరుతో తెలుగులో రిలీజ్ చేశాడు. ఈ మూవీ దిల్‌రాజుకు లాభాలు తెచ్చిపెట్టకపోయినా.. ఇక్కడ బ్రేక్‌ఈవెన్ సాధించింది. ఆ తర్వాత ఈ సినిమా శాటిలైట్ హక్కులను స్టార్ మా ఛానల్ దక్కించుకుంది. కాగా ఈ సినిమా స్టార్ మా చానల్‌లో వారానికి రెండు సార్లు ప్రదర్శితమవుతుంది. ఈ సినిమాను ఇప్పటికే చాలా మంది వీక్షించారు. మొన్న వచ్చిన ’గాడ్‌ఫాదర్’ సినిమా కూడా తెలుగులో ఆల్రెడీ చూసిన ’లూసీఫర్’ సినిమానే. అయితే లూసీఫర్ సినిమా ఎక్కువ మందికి తెలియదు. ఎందుకంటే అది ఏ చానల్‌లోనూ ప్రసారం కాలేదు. కేవలం అమెజాన్‌లో మాత్రమే ఉంది. ఇన్ని అడ్వాంటేజ్‌ల మధ్య రిలీజైన సినిమానే బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. అలాంటిది ’తేరి’ సినిమాను రీమేక్ చేస్తున్నాడంటే ఫ్యాన్స్ భయపడటానికి అర్థం ఉంది. గతంలో కూడా ఇలానే అజిత్ నటించిన ’వీరుడొక్కడే’ సినిమాను ’కాటమరాయుడుగా’ రీమేక్ చేసి చేతులు కాల్చుకున్నాడు. ఇవన్నీ పవన్ ఫ్యాన్స్‌లో ఆందోళనలు క్రియేట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ’వీ డోంట్ వాంట్ తేరీ రీమేక్’ అనే హ్యాష్‌ట్యాగ్ ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతుంది. అంతేకాకుండా ఒక లేడీ ఫ్యాన్ తేరీ సినిమా రీమేక్ చేస్తే సూసైడ్ చేసుకుంటా అని నోట్ రాసింది. ప్రస్తుతం ఈ నోట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. అయితే మరికొందరు మాత్రం పవన్ కంబ్యాక్ ఇచ్చిన ’గబ్బర్ సింగ్’ సినిమా కూడా ’దబాంగ్’కు రీమేక్‌గా తెరకెక్కిందే. హరీష్ ఎన్నో మార్పులు చేసి పవన్‌కు తగ్గట్టు కథను మార్చి బ్లాక్‌బస్టర్ సాధించాడు. అదే విధంగా ’గద్దలకొండ గణేశ్’ కూడా అల్రెడీ తెలుగులో డబ్ అయిన ’చిక్కడు దొరకడు’ మూవీకి రీమేక్‌గా తెరకెక్కిందే. కానీ హరీష్ తెలుగు నేటివిటీకి తగ్గట్లు మేజర్ మార్పులు చేసి సక్సెస్ అయ్యాడు. ఇక ఇప్పుడు ’తేరి’ సినిమాను కూడా మార్పులు చేసి తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు తెరెకెక్కిస్తాడని అంటున్నారు. ఇక పవన్ కూడా ఇప్పుడున్న బిజీ షెడ్యూల్‌లో రీమేక్ సినిమానే బెటర్ అని ’తేరి’ రీమేక్‌కు శ్రీకారం చుట్టాడని తెలుస్తుంది. మరీ దీనిపై హరీష్, శంకర్ ఏ విధంగా స్పందిస్తాడో చూడాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in